

మెట్రో మాల్స్ 'నెక్సస్ సెలక్ట్'కు లీజు

- రూ.3వేల కోట్లతో ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో రైలు 'రవాణా ఆధారిత అభివృద్ధి' (టిఒడి)లో భాగంగా ఎల్అండ్‌టి సంస్థ 'హైదరాబాద్ నెక్స్ట్ గల్లేరియా' పేరుతో పంజాగుట్ట, ఎర్రమంజిల్, హైటెక్ సిటీలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన మూడు మాల్స్ చేతులు మారాయి. లిస్టెడ్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు 'నెక్సస్ సెలెక్ట్'కు లీజుకిచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఇటీవల ముంబయిలో రూ.మూడు వేల కోట్లతో ఒప్పందం జరిగిందని సమాచారం. ఈ మూడు మాల్స్ 12 లక్షల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్నాయి. గత ఆగస్టులోనూ రాయదుర్గంలోని 15 ఎకరాల భూమిని, అక్కడే నిర్మించిన కార్యాలయ భవనాన్ని కలిపి రాఫర్టీ సంస్థకు సబ్ లైసెన్సు ఇచ్చింది. ఒప్పందం విలువ రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ రెండు లావాదేవీల ద్వారా ఎల్అండ్‌టీ మెట్రోకు మొత్తం రూ.4 వేల కోట్ల వరకు సమకూరనున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి మెట్రో రూ.4 వేల కోట్లకు పైగా నష్టాల్లో ఉంది. ఈ సబ్ లైసెన్సుల ద్వారా వాటి నుంచి గట్టెక్కాలనే ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది. అయితే నెక్సస్ సెలెక్ట్‌తో ఒప్పందంపై ఎల్అండ్‌టీ నుంచి తమకెలాంటి ప్రతిపాదనలు రాలేదని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్‌విఎస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశ పనులను ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో సంస్థ సొంత నిధులతో చేపట్టింది. ఇందుకు గాను నిర్మాణ సమయం కలిపి మొత్తం 35 ఏళ్లకు ఒప్పందం చేసుకుంది. ఈ కాలంలో ప్రయాణికుల ఛార్జీల ద్వారా 50శాతం ఆదాయం రాబట్టుకోవాలి. మరో 5 శాతం వాణిజ్య ప్రకటనలు, మిగిలిన 45 శాతం మెట్రో కారిడార్ వెంట ప్రభుత్వం కేటాయించిన భూముల్లో మాల్స్, కార్యాలయాల నిర్మాణాలు చేపట్టి అద్దెలు, లీజుల ద్వారా సమకూర్చుకోవాలి. వీటికి మాత్రం 60 ఏళ్ల గడువిచ్చారు. అనంతరం ప్రాజెక్టును సర్కారుకు అప్పగించాలి. ఇప్పటికే పదేళ్ల లీజు ముగిసింది. అయితే ఈ భూములను, అందులో నిర్మాణాలను లీజుకు ఇచ్చేందుకు, అమ్మేందుకు హక్కు లేదు. కొవిడ్ సమయంలో తీవ్రంగా నష్టపోయామని అప్పటి సర్కారుకు విన్నవించడంతో సబ్ లైసెన్సులకు ఆగస్టులో అనుమతిచ్చినట్లు ఎల్అండ్‌టీ మెట్రో చెప్పింది. సర్కారు నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

మేడారంలో నత్తనడకన పనులు

- ఫిబ్రవరి 21 నుంచి మహా జాతర
- కోటిన్నర మంది యాత్రికులు వస్తారని అంచనా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు గడువు దగ్గరపడుతున్నా ఇంకా కొన్ని పనులు ప్రారంభంకాలేదు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే ఈ మహా జాతరకు ఈసారి సుమారు కోటిన్నర మంది యాత్రికులు వస్తారని అంచనా. ఇప్పటికే యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివస్తూ ముందస్తు మొక్కులు సమర్పించుకుంటున్నారు. జాతర ఏర్పాట్లపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అధికారులతో ఇటీవల హైదరాబాద్‌లో సమీక్షించారు. పనులను ఈనెలాఖరు లోగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఆలోపు పూర్తి కావడం అనుమానమే. మహా జాతర ఏర్పాట్ల కోసం అన్ని శాఖలకు కలిపి రూ.75 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు ఆలస్యంగా మంజూరు కావడం వల్ల పనులు సైతం ఆలస్యంగానే ఆరంభమయ్యాయి. అంత వేగంగానూ జరగడం లేదు. కొన్ని పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గడువు సమీపిస్తుండటంతో హడావిడిగా చేపడితే నాణ్యత లోపించే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. యాత్రికులకు తాగునీటి వసతి కల్పన పనులు పూర్తి కాలేదు. 50 మినీ ట్యాంకులు, దాదాపు 400 సెన్సర్లతో పనిచేసే ట్యాప్‌లు (బ్యాటరీ ఆపరేటెడ్) ఏర్పాటు చేయాల్సి ఉంది. పైపులైను కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ట్యాప్‌ల వద్ద ప్లాట్‌ఫాంల నిర్మాణాలు కూడా ప్రారంభం కాలేదు. విద్యుత్తు పనులు దాదాపు 20 రోజులుగా వేగంగా సాగుతున్నాయి. జాతర పరిసరాల్లో దాదాపు 250 నియంత్రికలతో పాటు 10 కిలోమీటర్ల పరిధిలో స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు పూర్తి కావొస్తున్నాయి. మేడారంలో ఆర్‌టిసి బస్టాండ్, క్యూలైన్లు, నీడ షెడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. మేడారంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్గత రహదారుల నిర్మాణాలు, మరమ్మతు పనులు ఆరంభమయ్యాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విశ్రాంతి భవనం, భక్తుల వసతి షెడ్ల మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఆర్ అండ్‌బి ఆధ్వర్యంలో 14 పనులకు గాను ఆరు ప్రారంభమయ్యాయి. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో ఇసుక చదును, ఇన్‌టెక్ వెల్‌లలో పూడికతీత పనులు, ఐటిడిఎ ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల దారుల ఏర్పాటు పనులు కూడా కొనసాగుతున్నాయి. నిధుల విడుదలలో జాప్యం కావడంతోనే పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

స్నానఘట్టాల మరమ్మతులేవీ?

జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు దర్శనానికి వెళ్తారు. గత వర్షాలకు స్నానఘట్టాలు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. వాటి మరమ్మతు పనులింకా ప్రారంభం కాలేదు. జంపన్న వాగులో షవర్లు, దుస్తులు మార్చుకునే కంపార్టుమెంట్లు, ఆలయాలకు, గద్దెల వద్ద పెయింటింగ్, చలువ పందిళ్లు, కల్యాణ కట్టల మరమ్మతులు ప్రారంభం కాలేదు. క్యూలైన్ల మరమ్మతు పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. పనులు త్వరగా పూర్తిచేయాలని భక్తులు కోరుతున్నారు.

సంక్రాంతి 'కోడ్ఢీ' సై..!

- 'హద్దులు' దాటుతున్న పందెం కోళ్లు
- కోర్టులు వద్దన్నా...పోలీసులు అడ్డుకున్నా ఆగని పందేలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి అంటే బోగి మంటలు, ముగ్గులు, వివిధ రకాల వంటకాలే కాదు. కోడి పందేలూ ప్రధాన భాగమయ్యాయి. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా కోడి పందేల జోరు ఊపందుకుంది. బోగి రోజే కోడి పందేలు షురూ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు సరిహద్దు ప్రాంతాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిలాల నుంచి కూడా కోడి పందేలకు హాజరవుతున్నారు. చంకన పుంజులు పెట్టుకుని పందెం రాయుళ్ల పరుగులు పెడుతున్నారు. కోర్టులువద్దన్నా... నిషేధాజ్ఞలు ఉన్నా...పోలీసులు అడ్డుకున్నా కోడి పందేలు జోరు ఆగడం లేదు. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బరుల్లో పుంజులు బరిలోకి దిగుతూనే ఉన్నాయి. కత్తులు కట్టి కొందరు...కత్తులు లేకుండా మరికొందరు పందేలు వేస్తున్నారు. అడ్డంకులెన్నున్నా అధిగమించి పామాయిల్, జీడిమామిడి తోటల్లో పందేలు నిర్వహిస్తున్నారు. పోలీసుల కంటపడకుండా గుట్టుచప్పుడు పనికానిస్తున్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి కోడి పందేలకు సంపన్నుల పిల్లలు, పలువురు రాజకీయ, వాణిజ్య ప్రముఖులు సైతం కార్లలో వెళ్లి మరీ చేతి చమురు వదిలించుకుంటుండటం గమనార్హం. కోట్లలోనే ఈ పందేలు సాగుతున్నాయి. ఒకప్పుడు దసరా నుంచి సంక్రాంతి వరకు కొనసాగిన కోడిపందేలను కోర్టులు, ప్రభుత్వాలు నియంత్రించడంతో ప్రస్తుతం చాలావరకు తగ్గాయి.

బరుల్లోకి దిగేందుకు భారీగా సన్నద్ధం

పందెం కోళ్లకు కత్తులు కట్టడంలో నిపుణులను పోలీసులు బైండోవర్ చేసినా... ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూనే ఉన్నారు. ఈ కత్తులను కూడా ప్రత్యేకంగా తయారు చేయిస్తారు. జాతి కోడి పుంజులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి కయ్యానికి కాలు దువ్వేలా సిద్ధం చేశారు. అశ్వారావుపేట, పెనుబల్లి, సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లోని పలుచోట్ల పందెం కోళ్ల పారాలు నిర్వహిస్తున్నారు. తమిళనాడులోని సేలం జిల్లా నుంచి ప్రత్యేకంగా కోడిగుడ్లను తీసుకొచ్చి పొదిగించి... స్థానికంగా మేలుజాతి కోళ్లతో బ్రీడ్ చేసి వాటి పిల్లలను ప్రత్యేకంగా పెంచుతున్నారు. కర్నూలు జొన్నలు, జీడిపప్పు, పిస్తా, బాదంపప్పు తదితర బలవర్ధక ఆహారంతో ప్రత్యేకంగా పుంజులను పెంచి పందేనికి సిద్ధం చేశారు. కొందరు ఆంధ్రాలోని గోదావరి, నెల్లూరు జిల్లాల నుంచి కూడా పుంజులు తీసుకు వస్తుండటం గమనార్హం.

సై..సై...

పందెంరాయుళ్లు సై..సై అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఉమ్మడి జిల్లా సరిహద్దులో బరులు చేసుకున్నారు. అశ్వారావుపేట, వినాయకపురం, నారంవారిగూడెం, తిరుమలకుంట, జమ్మిగూడెం, దమ్మపేట, నాగుపల్లి, పట్వారీగూడెం, పెద్దగొల్లగూడెం, వడ్లగూడెం, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లోని మేడిశెట్టివారిపాలెం, ముత్తగూడెం, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల్లో పలుచోట్ల పందేలు నిర్వహిస్తున్నారు. ఇటు అశ్వారావుపేట మండల సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌లోని జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, వేలేరు పాడు, కుక్కునూరు, దమ్మపేట సరిహద్దులోని రాఘవపురం, చింతంపల్లి, సీతానగరం, పట్టాయిగూడెంలో పందేలు జోరుగా సాగుతున్నాయి. ఏటా సంక్రాంతి మూడురోజులు రోజుకు రూ.కోటి చొప్పున మూడు, నాలుగు కోట్లు చేతులు మారుతాయి. పెద్దబరుల్లోనే కాకుండా పైపందేలు సైతం రూ.వేలల్లో కాస్తుంటారు.

కుక్కుటశాస్త్రం ఆధారంగా...

కుక్కుటశాస్త్రం ఆధారంగా పందేలు నిర్వహిస్తారు. నల్లని ఈకల కాకి, ఎర్రని ఈకల డేగ, పసుపు ఈకల నెమలి, నలుపు, ఎరుపు ఈకల కౌజు, తెల్లని ఈకల సేతువ, ఎరుపు, బూడిదరంగు మైల, ముంగిస, అబ్రాసు, పచ్చకాకి, నలుపు, ఎరుపు కాకిడేగ ఇలా రకరకాల పుంజులను కుక్కుటశాస్త్రం ఆధారంగా బరుల్లో దించుతారు. సమయాన్ని బట్టి ఏ కోళ్లు గెలుస్తాయో వాటిని ప్రవేశపెడతారు. ముసుగు పందెం, కత్తి పందెం, విడికాళ్లు, జోడి పందెం, చూపుడు పందెం ఇలా పలు రకాలుగా పందేలు వేస్తారు. పుంజు తీరును బట్టి వాటిపై పందెం ఉంటుంది. బరుల్లో ఉండి కొందరు, బరి బయట మరికొందరు పందేలు కాస్తారు.

6261 ప్రత్యేక బస్సులు

ఒక్కరోజులోనే 52.78 లక్షల మంది ప్రయాణం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి)కి ప్రయాణీకులు బ్రహ్మరథం పట్టారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంస్థ నిర్దేశించుకున్న ప్రత్యేక బస్సులకంటే అదనంగా ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'మహాలక్ష్మి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని అన్ని ప్రాంతాల మహిళలు వినియోగించుకున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, సిబ్బంది పరస్పరం సహకరించుకొని, ముందస్తు ప్రణాళికకు మించి అదనపు బస్సుల్ని నడిపారు. సంక్రాంతి సందర్భంగా 4484 ప్రత్యేక బస్సుల్ని నడపాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని ముందే అంచనా వేసి, గత ఏడాదికంటే అధిక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఆ అంచనాలకు మించి ప్రయాణీకుల నుంచి రద్దీ ఏర్పడింది. దీనితో 6,261 ప్రత్యేక బస్సుల్ని నడిపినట్టు టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ఈనెల 13వ తేదీ ఒక్కరోజే 1,861 ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపామనీ, దానిలో 1,127 హైదరాబాద్ సిటీ బస్సులను ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న కరీంనగర్, వరంగల్, విజయవాడ, ఖమ్మం తదితర రూట్లలో తిప్పామని ఆయన వెల్లడించారు. ఈనెల 13వ తేదీ ఒక్క రోజే 52.78 లక్షలమందిని ఆర్‌టిసి సిబ్బంది సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారనీ, దానిలో సగానికిపైగా మహిళా ప్రయాణీకులే ఉన్నారని ఎమ్‌డీ వివరించారు. ముందస్తు ప్రణాళిక, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల సంక్రాంతికి ప్రశాంతంగా ప్రయాణీకులను సొంతూళ్లకు సంస్థ చేర్చామన్నారు. తొలిసారిగా బస్‌భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి, రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ సందర్భంగా టిఎస్‌ఆర్‌టిసి సిబ్బంది, అధికారులు, ప్రయాణీకులకు ఎమ్‌డీ సజ్జనార్ ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా పరిధిలోని అనంతగిరి కొండల్లో ఆర్‌టిసి బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం వికారాబాద్ నుంచి తాండూరుకు వెళ్తున్న బస్సు అనంతగిరి కొండల్లోని ఆఖరి మూలమలుపు సమీపంలో అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఎదురుగా ఇతర వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను వికారాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు బ్రేక్స్ ఫెయిల్ అవడం వల్లే ప్రమాదం జరిగిందని.. ఆ సమయంలో అందులో 100 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

మరో ఐడిఎ బొల్లారంగా వెలిమినేడు !

- గాలి, నీటి కాలుష్యంతో దెబ్బతింటున్న పంటలు
- ఉక్కిబిక్కిరి అవుతున్న 20 గ్రామాల ప్రజలు
- ఫ్యాక్టరీ విస్తరణకు 19న ప్రజాభిప్రాయ సేకరణ
- వ్యతిరేకిస్తున్న స్థానికులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెలిమినేడు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామ శివారులో గల ఎంపిఎల్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వల్ల వెలిమినేడుతో పాటు పిట్టంపల్లి, ఏపూరు, సుంకెనపల్లి, గుండ్రాంపల్లి, బొంగోని చెరువు గ్రామాల చుట్టుపక్కల ఉన్న సుమారు 20 గ్రామాలు వాయు, నీటి కాలుష్యంతో పంట పొలాలు, పక్షులు, పశు సంపద పూర్తిగా నాశనం అవుతున్నాయి. ప్రజలు శ్వాస కోశ వ్యాధులకు గురవుతున్నాయి. గాలి నాణ్యత తగ్గుతున్నదని వాతావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి సుమారు 10 కెమికల్ కంపెనీల నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత వెదజల్లే విషవాయువుల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున విషం చిమ్ముతున్న ఈ ఎంపిఎల్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీకి అనుసంధానంగా యాజమాన్యం అదనపు నిర్మాణ ఏర్పాటుకు అనుమతులు కొరకు దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించి ఈనెల 19న ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. దీనికి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఆపాలని, అధికారులు స్పందించి వెలిమినేడు ప్రాంతం మరో ఐడిఏ బొల్లారం గా మారకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల మనుగడకే ప్రశ్నార్థకం : బొంతల చంద్రారెడ్డి, వెలిమినేడు గ్రామ మాజీ సర్పంచ్

ఎంపిఎల్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వలన వాయు కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. పండ్ల తోటలు, వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కలుషితమైన పశుగ్రాసం తిని పశువులు చనిపోతున్నాయి. తూతూమంత్రంగా పంట నష్టపరిహారం చెల్లించి రైతుల నోళ్లు మూయిస్తున్నారు. వాయు కాలుష్యంతో వచ్చే ఇబ్బందుల వల్ల ఈ ప్రాంత ప్రజల మనుగడకే ప్రశ్నార్థకం అవుతుంది. అధికారులు పజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి.

పంటల దిగుబడి తగ్గింది: మెట్టు పరమేష్ యాదవ్ (పిట్టంపల్లి గ్రామ ఉపసర్పంచ్)

ఎంపీఎల్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వల్ల మా ప్రాంతంలో వరి, పత్తి పంటలు దిగుబడి తగ్గింది. వాయు కాలుష్యంతో గ్రామాలలో శ్వాసకోశ, చిన్న వయసులోనేమూత్రపిండాల వ్యాధులకు గురవుతున్నాం. ఈ ఫ్యాక్టరీ వల్ల జరిగే నష్టాలను గతంలోనే జిల్లా పర్యావరణ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, మండల తహశీల్దార్ కు వినతి పత్రాలు ఈ ప్రాంత ప్రజలు ఇచ్చారు. ఈనెల 19న జరిగే ప్రజా సేకరణను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలి.

పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలి: కత్తుల లింగస్వామి (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు)

చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఎంపిఎల్ స్టీల్ ఇండస్ట్రీ పరిశ్రమ విస్తరణకు అనుమతులను ఇవ్వొద్దు. గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేసిన ఫలితంగా కొద్దిరోజులు పరిశ్రమ మూతపడి మళ్లీ విస్తరణ చేయడం తగదు. కంపెనీ విస్తరణ తక్షణమే నిలుపుదల చేయాలి.

ప్రయివేటు బస్సులో రూ. 13 లక్షల చోరీ

- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ ప్రైవేట్ బస్సులో గుర్తుతెలియని దుండగులు భారీ చోరీకి పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగాపూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రయివేటు బస్సులో భారీ చోరీ జరగడంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఓ ప్రయివేట్ బస్సు ముంబయి నుంచి జగిత్యాల వెళ్తోంది. అయితే ఆ బస్సులో హనుమంతు అనే వ్యక్తి సుమారు రూ.13 లక్షలు తీసుకొని జగిత్యాలకు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో సారంగాపూర్ డైరీ ఫార్మ్ వద్ద ప్రయాణికులు చాయి తాగేందుకు బస్సు దిగారు. ఇదే అదునుగా భావించిన దుండగుడు హనుమంతు బ్యాగును అపహరించుకుపోయాడు. దీంతో బాధితుడు ఆరవ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రయివేట్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. బస్సులో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని దుండగుడు సిసి కెమెరాకు చెయ్యి అడ్డు పెట్టి దొంగతనానికి పాల్పడినట్టుగా పోలీసులు నిర్ధారించారు. దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

కైట్ ఫెస్టివల్‌లో నేతల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహిస్తున్న కైట్ ఫెస్టివల్‌లో ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికొచ్చిన సందర్భంగా రైతులు చేసుకునే పండుగే సంక్రాంతి అని కిషన్‌రెడ్డి చెప్పారు. సంక్రాంతిని నేడు ప్రపంచమంతా నిర్వహించుకుంటోందని చెప్పారు. కైట్ ఫెస్టివల్‌లో ఆయన పతంగి ఎగురవేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు పండుగకు 4 నెలల ముందు నుంచే పతంగుల సందడి ఉండేదని.. ప్రస్తుతం పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో ఆసక్తి కొరవడిందన్నారు. తమ పిల్లలకు తల్లిదండ్రులు మన సంప్రదాయాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

శాసనసభ వ్యవహారాల సలహాదారుగా పసన్నకుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శాసనసభ వ్యవహారాల సలహాదారుగా సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో సేవలు అందించారు. ఐదేండ్లపాటు లోక్‌సభ స్పీకర్ ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ఢిల్లీ శాసనసభకు సేవలు అందించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన వివిధ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించారు

మధుసుధన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారికి సురేందర్ ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ విధుల్లో ఉంటూ...ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన రంగారెడ్డి సరూర్‌నగర్ ప్రభుత్వ కళాశాల జూనియర్ లెక్చరర్ మధుసూదన్‌రెడ్డి (సస్పెండ్)తోపాటు మరో తొమ్మిది మంది ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది నారపాక సురేందర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు లిఖిత పూర్వకంగా ఆయన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశించారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించినట్టు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధరల దోపిడీ.. 'జీరో' దందా..!

- ఖమ్మం మార్కెట్ ఆదాయానికి భారీ గండి
- నిలకడలేని మిర్చి ధరలతో రైతుల్లో ఆందోళన
- అధికారులతో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల సమీక్ష
- అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మిర్చి మార్కెట్లో 'జీరో' వ్యాపారం జోరుగా నడుస్తోంది. ఓవైపు ధరలు తగ్గించి దోపిడీకి పాల్పడుతున్న వ్యాపారులు మరోవైపు ఈ జీరో దందాను కొనసాగిస్తున్నారు. రోజుకు కనీసం రూ.3 లక్షల వరకు మార్కెట్ ఆదాయానికి గండికొడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు 30వేల బస్తాలు అమ్మకానికి వస్తే వాటిలో సగం, అంతకన్నా తక్కువ సరుకును మాత్రమే చూపించి మార్కెట్‌కు రావాల్సిన ఆదాయాన్ని వ్యాపారులు కాజేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మార్కెట్‌కు వచ్చిన సరుకును బయటే బేరమాడి కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ధరలను తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు కూడా నష్టపోతున్నారు. మార్కెట్లో చోటుచేసుకుంటున్న దోపిడీపై రైతులు ఆందోళన నిర్వహించారు.

ఖమ్మం మార్కెట్ విషయంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. అధికారులను హైదరాబాద్ పిలిపించి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్లలో జెండా పాటలు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్లకు వస్తున్న ఆదాయంపై నాలుగు రోజులుగా సీరియస్‌గా దృష్టి సారించారు. శుక్రవారం ఆకస్మికంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మంత్రి సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ధరల్లో వ్యత్యాసాలు, మార్కెట్ ఆదాయానికి గండికొట్టే చర్యలపై వ్యాపారులు, అధికారులను సీరియస్‌గా హెచ్చరించారు. పండుగ తర్వాత ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఊరుకునేది లేదని చెప్పారు.



మార్కెట్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జెండాపాటతో పొంతన లేని ధరలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో జెండాపాటతో పొంతన లేకుండా ధరలు ఉంటాయి. తద్వారా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. పంట విక్రయాలు పెరిగే కొద్దీ ధరలు తగ్గుతుండటంపై రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. నెల రోజులుగా మిర్చి ధర దాదాపు రూ.3,500కు పైగా తగ్గింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సోమవారం క్వింటాల్ మిర్చి గరిష్ఠంగా రూ.21 వేల ధర పలకగా మంగళవారం నాటికి రూ.500 తగ్గింది. మంత్రి సమీక్షలు, హెచ్చరికల నేపథ్యంలో ధరను కొంతమేర పెంచారు. శుక్రవారం క్వింటాల్ మిర్చి గరిష్ఠంగా రూ.21,300 ధర పలికింది. గత నెలలో రూ.24,500 పలికిన మిర్చి ధర ఈ నెల ఆరంభంలో 23,600కు చేరింది. 3న రూ.23 వేలున్న ధర 8వ తేదీ నాటికి క్రమేణా క్షీణించి.. రూ.21 వేలుగా నమోదైంది. ఒకటి, రెండు లాట్లకే జెండాపాట ధరలు పెట్టి మిగిలిన మొత్తానికి రూ.20 వేల లోపే ధరలు పెడుతుండంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

విదేశాల్లో డిమాండ్ ఉన్నా

తేజా రకం మిర్చికి విదేశాల్లో డిమాండ్ ఉన్నా.. నాణ్యత పేరు చెప్పి వ్యాపారులు దగా చేస్తున్నారు. మొదటి కోత మిరపకాయలు కావడంతో తేమ అధికంగా ఉందని, మిర్చి నాణ్యత లేదని తక్కువ ధరకు కొంటున్నారు. రెండేండ్లుగా తామర పురుగు ప్రభావం ఉండటంతో రైతులు ఈ ఏడాది ముందస్తుగా మిరప సాగు చేశారు. ఆగస్టులో సాగు ప్రారంభించాల్సిన పంటను జులైలోనే మొదలు పెట్టడంతో.. ఫిబ్రవరిలో రావాల్సిన పంట జనవరి నుంచే వస్తోంది. ఇదే సమయంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లోనూ మిర్చి కోతలు ప్రారంభించడంతో ధరలు తగ్గుతున్నాయనే వాదనను వ్యాపారులు ముందుకు తెస్తున్నారు.

సరుకు తక్కువ పేరుతో ఆదాయానికి గండి

మార్కెట్‌కు ఈ నెల ఆరంభం నుంచి రోజుకు పదివేల బస్తాలకు పైగానే వస్తున్నాయి. కానీ వ్యాపారులు, అధికారులు ఏకమై సరుకు తక్కువగా వస్తుందని సాకు చూపించి మార్కెట్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈనెల ఆరంభంలో ఏడువేల బస్తాలు, ఐదో తేదీ నాటికి 8,600 బస్తాలు చూపించారు. మంత్రి తుమ్మల దృష్టి సారించే వరకు పదివేల లోపు బస్తాలనే చూపించారు. సోమవారం నుంచి 14వేలకు పైగా బ్యాగ్‌లు వచ్చినట్లు చూపుతున్నారు. కానీ ఇప్పటికి కూడా వచ్చిన సరుకులో సగం మాత్రమే మార్కెట్ గణాంకాల్లో నమోదవుతుందనే ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ నిమిత్తం ప్రత్యేక బృందాలు
తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి

మిర్చి కొనుగోళ్లలో అవకతవకలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. ధరల్లో వ్యత్యాసం రాకుండా చూస్తున్నాం. అదనపు సిబ్బందిని కూడా నియమించాలని ఆదేశాలిచ్చాం. పంట సీజన్‌లో అదనపు ఉద్యోగులను నియమించి దళారులు, లైసెన్స్‌లు లేనివారు మార్కెట్లోకి రాకుండా చూడాలని చెప్పాం. రైతులతో పాటు మార్కెట్ ఆదాయానికి కూడా గండిపడకుండా చర్యలు చేపట్టాం.

కాళేశ్వరం పై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది

- ఏడాది చివరికల్లా ఐదు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు
- వర్షా కాలంలోపు చెరువుల పూడికతీత పనులు పూర్తి : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్‌పై మరో వైపు జ్యూడిషియల్ విచారణ కోసం హైకోర్టు చీఫ్ జడ్జికి లేఖ రాశామనీ, అనుమతి రాగానే విచారణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఏడాది చివరి కల్లా 4.5 లక్షల ఎకరాల నుంచి 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నీటి పారుదల శాఖలో గత పాలకులు ఓ ప్రణాళిక లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల అప్పులు పెరిగాయే తప్ప కొత్తగా అయకట్టు సాగులోకి రాలేదన్నారు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా అవసరమైన నిధులను ఖర్చు చేసి కొత్త ఆయకట్టు సృష్టించాలని సూచించారు. కృష్ణ, గోదావరి పరివాహకంలో 18 ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేయడంతోపాటు రాబోయే ఐదేండ్లలో ఏ ప్రాజెక్టు కింద ఎన్ని ఎకరాలు కొత్తగా సాగులోకి వస్తాయో సమాచారం సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలోపు రాష్ట్రంలోని చెరువుల పూడికతీత, జంగిల్ కటింగ్ పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మంథని నియోజక వర్గానికి నీరందించే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు కోయిన ప్రాజెక్టు నుంచి వంద టిఎంసి నీటితో పాటు విద్యుత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని తెలిపారు. ఈ సమీక్షలో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇఎన్‌సి మురళీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ వేదికగా పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేర్లతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఢిల్లీకి చెందిన పంచాల్ సూచనలతో హర్యానా ఫరీదాబాద్‌కు చెందిన హిమాన్ష్, ప్రవీణ్ నకిలీ ఆధార్, పాన్ కార్డులు తయారు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. పాన్ కార్డుల ద్వారా ఫేక్ కరెంటు ఖాతాలు తెరిచి దాదాపు రూ.2.5 కోట్లు సొమ్ము చేసుకున్నారు. అమీర్‌పేటకు చెందిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి చరవా ణులు, సిమ్‌కార్డులు, చెక్‌బుక్‌లు సహా పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడికి నకిలీ లింక్‌లు పంపించి దాదాపు రూ.4.75 లక్షలు నిందితులు వారి ఖాతాలో జమ చేయించుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ పేరిట వచ్చే నకిలీ సందేశాలను నమ్మవద్దని, ధ్రువీకరణ లేని వెబ్‌సైట్స్ చూసి మోసపోవద్దని సూచిస్తున్నారు.

హసన్‌పర్తి - ఉప్పల్ మధ్య విద్యుదీకరణ పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజీపేట - బల్హార్షా విద్యుద్దీకరణ ప్రాజెక్టులో భాగంగా హసన్‌పర్తి - ఉప్పల్ మధ్య 12.7 కి.మీ విద్యుద్దీకరణతో పాటు మూడో లైన్ పనులను దక్షిణ మధ్య రైల్వే పూర్తి చేసి.. రాకపోకలు ప్రారంభించింది. కాజీపేట - బల్హార్షా మధ్య ఉన్న సెక్షన్ గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉత్తర ప్రాంతాలను దేశంలోని దక్షిణ ప్రాంతంతో కలుపుతూ ఉన్న కీలకమైన రైలు మార్గం అని రైల్వే శాఖ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 131.7 కి.మీ పరిధిలో పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఈ సెక్షన్ తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలోకి వస్తుంది. గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉన్న ఈ మెయిన్‌లైన్ ప్యాసింజర్, సరకు రవాణా రెండింటిలో నిరంతర వద్ధిని సాధిస్తోందని అధికారులు వివరించారు. హసన్‌పర్తి - ఉప్పల్ మధ్య ట్రిప్లింగ్, విద్యుద్దీకరణ పనులను పూర్తి చేసిన సికింద్రాబాద్ డివిజన్, నిర్మాణ సంస్థ సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందనీ, 75 తెగలను ఆదివాసీలుగా గుర్తించామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశాలు నిర్వహించారు. వాటిలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ మంత్రి రవీంద్రనాయక్, దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మోడీ ప్రధాని అయ్యాకే గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయిందని తెలిపారు. సోమవారం నుంచి ప్రధాని ఆదివాసీల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమం ప్రారంభం కాబోతున్నదని తెలిపారు. అర్హులైన ఆదివాసీలకు సొంత ఇండ్ల పట్టాలు ఇవ్వబోతున్నామన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ పాఠశాలల ద్వారా మూడు లక్షల ఆదివాసీ విద్యార్థులకు చదువు అందించబోతున్నామని చెప్పారు. తెలంగాణకు ట్రైబల్ యూనివర్సిటీ ఇచ్చామనీ, తాత్కాలిక యూనివర్సిటీ ద్వారా విద్య అందిస్తామని తెలిపారు.

గుండె పోటుతో ఆటోడ్రైవర్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మీదికొండలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ (55) ఆటో నడుపుకుంటూ, భార్య, ముగ్గురు కుమార్తెలను పోషిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తేవడంతో, ఆటో నడవక, పండుగ వేళ సైతం గిరాకీ లేకపోవడంతో మనస్తాపానికి గురై గుండెపోటుతో మరణించినట్టు తెలిపారు. ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు గుర్రం మధు మోహన్, జయపాల్ ఆటో యూనియన్ కార్మికులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పాత పద్ధతిలోనే అధ్యాపకుల నియామకాలు!

- విశ్వవిద్యాలయం యూనిట్‌గా పోస్టుల భర్తీ
- కామన్ నియామక బోర్డును వెనక్కి తీసుకోవాలని సర్కారు యోచన
- త్వరలో గవర్నర్‌తో విద్యాశాఖ సంప్రదింపులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ప్రభుత్వం దృష్టిసారించింది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మినహా రాష్ట్రంలోని 15 వర్సిటీల పరిధిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కామన్ నియామక బోర్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించారు. అయితే గవర్నర్ ఆ బిల్లును ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలనకు సిఫారసు చేశారు. దీంతో కామన్ నియామక బోర్డు బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. దీంతో తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి విశ్వవిద్యాలయాల్లో నియామకాల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేయాలని భావించి బిల్లును తెచ్చింది. గవర్నర్ ఆమోదించకపోవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. విద్యాశాఖపై సమీక్ష సమయంలో వర్సిటీల్లో ఖాళీలు, నియామకాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. కామన్ నియామక బోర్డు బిల్లు గురించి అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని సిఎం సూచించారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీని పాత విధానంలో చేపడితే బాగుంటుందని ఉన్నత విద్యామండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దాన్ని పరిశీలించాలని సూచించినట్టు తెలిసింది. దీంతో త్వరలోనే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వద్దకు విద్యాశాఖ అధికారులు వెళ్లి కామన్ నియామక బోర్డు బిల్లు గురించి వివరాలు తెలుసుకునే అవకాశమున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి చేపట్టబోయే నిర్ణయాల గురించి చెప్తారని తెలుస్తున్నది. కామన్ నియామక బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలని గవర్నర్‌కు విన్నవించాలని అధికారులు భావిస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తయితేనే పాత విధానంలో విశ్వవిద్యాలయాల వారీగా అధ్యాపక పోస్టుల భర్తీకి మార్గం సుగమం అవుతుంది. ఇదే విషయాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చే అవకాశమున్నది.

70 శాతం అధ్యాపక ఖాళీలు

రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల పరిధిలో 70 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 2,825 పోస్టులుంటే అందులో 873 (30 శాతం) మంది ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. 1,977 (70 శాతం) ప్రొఫెసర్ పోస్టులు ఖాళీలున్నాయి. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల పరిధిలో 1,551 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిలో మొదటి విడతలో 1,061 పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం 2017, నవంబర్ 25న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పోస్టులు భర్తీ కాలేదు. గతంలో విశ్వవిద్యాలయం యూనిట్‌గా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేసి నియామకాల ప్రక్రియ చేపట్టేవారు. మళ్లీ ఆ విధానం అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకనుగుణంగా చర్యలు చేపడుతోంది. గవర్నర్‌తో సంప్రదించిన తర్వాత న్యాయ నిపుణుల అభిప్రాయాలను తీసుకుని మార్గదర్శకాలను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల త్వరగా వర్సిటీల్లో నియామకాల ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు.

విశ్వవిద్యాలయాల వారీగా అధ్యాపక పోస్టుల వివరాలు

యూనివర్సిటీ	మంజూరైన పోస్టులు	పని చేస్తున్నది	ఖాళీలు	భర్తీ చేసేవి
ఉస్మానియా	1267	376	891	415
కాకతీయ	409	86	323	136
డా॥బిఆర్ అంబేద్కర్	86	34	52	10
పొట్టి శ్రీరాములు	72	14	58	07
తెలంగాణ	152	61	91	59
మహాత్మాగాంధీ	70	35	35	34
శాతవాహన	63	16	47	40
పాలమూరు	95	21	74	63
జెఎన్‌టియుహెచ్	410	169	241	186
జెఎన్ఎఫ్ఎయు	55	17	38	15
ఆర్‌జియుకెటి	146	19	127	0
మహిళా	0	25	0	0
మొత్తం	2825	873	1977	1061

హత్యా రాజకీయాలు మానుకోవాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'గ్రామాలలో పలు సమస్యలు ఎదురవుతూ ఉంటాయని వాటిని శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. హత్యా రాజకీయాలు చేయకూడదు. ఇది ప్రజాస్వామానికే విరుద్ధం. హత్యా రాజకీయాలు మానుకోవాలి' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ప్రత్యర్థి పార్టీలకు విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని గంట్రావుపల్లి గ్రామంలో 20 రోజుల క్రితం భూ తగాదాల వల్ల రిటైర్డ్ ఆర్మీ జవాన్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మల్లేష్ హత్యకు గురి అయ్యాడు. ఈ విషయాన్ని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆదివారం గంట్రావుపల్లి గ్రామంలోని మల్లేష్ ఇంటికి వెళ్లి మల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మల్లేష్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ తరపున రూ. ఐదు లక్షల చెక్కును అందజేశారు. ఆయన వెంట మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు గణేష్‌రావు, హర్షన్న నాయకులు రవి నాయక్, కొత్తపేట సింగిల్ విండో అధ్యక్షులు అట్ల రాజేందర్ గౌడ్, పెద్ద కార్ పాముల సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ జక్కుల నరసింహ, తదితరులు ఉన్నారు.

ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యదర్శిగా సదానందంగౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత సెకండరీ ఉపాధ్యాయుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శిగా జి.సదానందం గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఈ మేరకు ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వత్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో జరిగిన ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ సమావేశాల్లో ఈ ఎన్నిక జరిగిందని తెలిపారు. ప్రస్తుతం సదానందం గౌడ్ ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాలానుగుణంగా విద్యలో, బోధనలో వస్తున్న మార్పులపైనా, తరగతి గదుల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపైనా ఎఐఎస్‌టిఎఫ్ విస్తృతంగా పరిశోధనలు చేసి ఆ పత్రాలను ప్రభుత్వాలకు అందజేస్తున్నదని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ రంగ సమస్యలపైనా అధ్యయనం చేస్తూ అనేక పోరాటాలను చేస్తున్నదని పేర్కొన్నారు. అలాంటి కీలకమైన ఎఐఎస్‌టిఎఫ్‌లో మూడు దశాబ్దాల కిందట తెలుగు రాష్ట్రాల నుంచి శ్యాంసుందర్‌రావు ఈ పదవి చేపట్టారనీ, ప్రస్తుతం ఆ పదవి సదానందం గౌడ్‌ను వరించిందని తెలిపారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన

- అంతర్జాతీయ స్థాయి కంపెనీల సిఇఒలతో భేటీ
- కీలక రంగాల్లో పెట్టుబడులపై సంతకాలు చేసే అవకాశం
- పర్యటన వివరాలను వెల్లడించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి భారీఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా తమ దావోస్ పర్యటన సాగుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూలతలు, బలాబలాలు, తమ ప్రాధాన్యతలను వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదిక ద్వారా చాటి చెబుతామని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 54వ వార్షిక సమావేశంలో పాల్గొనడానికి సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం పర్యటనకు సంబంధించిన వివరాలను ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓ ప్రకటనలో వెల్లడించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో పాల్గొనాల్సిందిగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఆహ్వానం అందిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశానికి వెళ్తున్న రాష్ట్ర అధికారిక బృందానికి సీఎం నేతృత్వం వహించడం ఇది తొలిసారని పేర్కొన్నారు. ఈ బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కూడా ఉంటారని తెలిపారు. విదేశీ, భారతీయ పారిశ్రామికవేత్తలను కలుసుకుని కొత్త ప్రభుత్వ విజన్, ప్రాధాన్యతలను వివరించడానికి వరల్డ్ ఎకనామిక్ ఫోరం అవకాశం ఇస్తుందని అభిప్రాయపడ్డారు. ఐటీ రంగంలో అగ్రగామిగా, లైఫ్ సైన్సెస్ రంగానికి హబ్‌గా ఉన్న తెలంగాణ బలాలను ప్రపంచానికి చాటి చెప్పి పెట్టుబడులను ఆకర్షించడానికి ఇది చక్కటి వేదిక అని పేర్కొన్నారు. మూడు రోజుల దావోస్ పర్యటనలో తాను, సీఎం కలిసి 70 మందికి పైగా పారిశ్రామిక దిగ్గజాలను కలవబోతున్నామని వెల్లడించారు. తాము సమావేశం కాబోతున్న వారిలో నొవర్టీస్, మెడ్ ట్రానిక్స్, ఆస్ట్రాజనిక, గూగుల్, మాస్టర్ కార్డ్, బేయర్, ఎల్డీసీ, యుపిఎల్ తదితర అంతర్జాతీయ కంపెనీల సీఈఓలు, సీఎక్స్ఓలు ఉన్నారని తెలిపారు. భారత్‌కు చెందిన టాటా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, జేఎస్‌డబ్ల్యూ గోద్రెజ్, ఎయిర్‌టెల్, బజాజ్ వంటి సంస్థల ప్రతినిధులతో భేటీ అవ్వడమే కాకుండా సీఐఐ, నాస్కం వంటి వ్యాపార ఛాంబర్స్ ప్రతినిధులతో సమావేశం అవుతామని వివరించారు. దావోస్ పర్యటన విజయవంతం కావటానికి ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలిపెట్టడం లేదనీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. తొలిసారి దావోస్ పర్యటనలోనే సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక గౌరవం దక్కిందనీ, ఆయనను వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో మాట్లాడవలసిందిగా ఆహ్వానించారని వెల్లడించారు. అక్కడ జరగబోయే చర్చాగోష్ఠిలో పురోగమిస్తున్న వైద్యరంగంపై అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. "ఫుడ్ సిస్టమ్స్ అండ్ లోకల్ యాక్షన్" అనే అంశంపై జరగనున్న అత్యున్నత స్థాయి సదస్సులో పాల్గొని ఆగ్రి - ఎకానమీపై వాతావరణ మార్పుల ప్రభావం, రైతుల జీవనోపాధిని పరిరక్షించడానికి వాతావరణం ప్రకారం సాగే వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యలపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమ వర్గాలు ఏర్పాటు చేస్తున్న చర్చా వేదికలో "డెవలపింగ్ స్కిల్స్ ఫర్ ఏఐ" అనే అంశంపై తాను మాట్లాడటమే కాకుండా టెక్ కంపెనీలు, వర్తక సంస్థలు, ప్రవాసీ భారతీయ పారిశ్రామికవేత్తలను కూడా కలుసుకుంటానని చెప్పారు. ఈ పర్యటనలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు బ్రెండే బోర్జ్‌తో సమావేశం అవుతామని ప్రకటించారు. రాష్ట్రంతో వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి బలమైన వ్యవస్థీకృత సంబంధాలున్నాయనీ, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి సంబంధించిన సెంటర్ ఫర్ 4త్ ఇండస్ట్రీయల్ రెవల్యూషన్ (సీ4ఐఆర్) సదస్సు హైదరాబాదులో జరగబోతున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయం ఆహార శుద్ధి రంగాల్లో సాంకేతిక ఉపక్రమణలకు ఆ సంస్థ క్రియాశీలకంగా మద్దతిస్తోందని పేర్కొన్నారు.

పర్యాటకులతో కిటకిటలాడిన లక్నవరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం పర్యాటక కేంద్రం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుండి సాయంత్రం వరకు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చి లక్నవరం పర్యాటక కేంద్రంలో అందాలను వీక్షించారు. రామప్ప మేడారం సందర్శించిన పర్యాటకులు కూడా పెద్ద సంఖ్యలో లక్నవరం పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. బోటు షికారు, స్పీడ్ బోటు, వేలాడే వంతెనపై నడుస్తూ సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదకరంగా కాలక్షేపం చేశారు. హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పర్యాటకులు లక్నవరం పర్యాటక కేంద్రాన్ని సందర్శించినట్టు మేనేజర్ శంకర్ తెలిపారు. వరుసగా సెలవులు ఉండటం వల్ల పర్యాటకుల సంఖ్య పెరిగిందని పెరిగిన పర్యాటకులకు తగినట్టుగా సదుపాయాల ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్లు కిలోమీటర్ల పొడవునా నిలిచిపోయాయి. చిన్నపిల్లలు, వృద్ధులు పేషెంట్లు ఉన్నందున భోజన సదుపాయం లేకపోవడంతో ఇబ్బంది పడ్డామని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బుసాపురంలో భోజనం చేయాల్సి వస్తోందని పర్యాటకులు తెలిపారు. వెంటనే క్యాంటీన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సరస్వతీ బ్యారేజీకి మరమ్మతులు..

గ్రౌంటింగ్ పనులు ముమ్మరం..

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం సరస్వతీ బ్యారేజీకి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఐదో బ్లాక్ లోని 28,38 పియర్ల వద్ద పడిన సీపేజీలను గుర్తించి అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు. రీజైన్ ప్రక్రియ ద్వారా గ్రౌంటింగ్ పనులు చేపడుతున్నారు. మొదట సీపీజీ వద్ద ఇసుక బస్తాలతో రింగ్ బండ్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత పాలి యూరేహియన్ తో గ్రౌంటింగ్ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 38 పియర్ వద్ద పనులు కొనసాగుతున్నాయి. గతేడాది అక్టోబరు లో మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలో పియర్స్ కుంగింది. ఆ సమయంలోనే అన్నారంలో బ్యారేజీ దిగువన బుంగలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతత్వంలో మంత్రుల బందం డిసెంబరులో అన్నారం సందర్శించింది. మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించించారు.

త్వరలో బిఆర్ఎస్‌లో చీలిక

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముట్టుకునే ధైర్యం ఉందా?
- బండి సంజయ్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ త్వరలోనే రెండుగా చీలిపోతుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్‌లకు ఒక పార్టీకి సంబంధించిన సమాచారం మరో పార్టీకి తెలుసునని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్లాన్ చేస్తున్నారంటూ బిజెపి ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలను పొన్నం తిప్పికొట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముట్టుకునే దమ్ముందా? అని బిజెపి, బిఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఏమీ లేదని స్పష్టం చేశారు. 'బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అంటే ఇన్నాళ్లు కొందరు నమ్మలేదు కానీ బండి సంజయ్ వ్యాఖ్యల వల్ల ఇప్పుడు అందరూ నమ్ముతున్నారు' అని వ్యాఖ్యానించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం మాజీ సిఎం కెసిఆర్, బోయినపల్లి వినోద్‌కుమార్, బిజెపి ఎంపీ బండి సంజయ్ ఏం చేశారని ప్రశ్నించారు. ఈ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 'బండి సంజయ్ ఏమైనా జ్యోతిష్యం చదివారా? మా పార్టీ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారో మీకెందుకు?. ఇక్కడ కాంగ్రెస్ ఉంది. కేంద్రంలోనూ కాంగ్రెస్ రావాలి' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుట్రలు చేస్తే నామరూపాలు లేకుండా చేస్తారు : అద్దంకి దయాకర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు చేస్తే ఏ పార్టీ అయినా ప్రజలే నామరూపాలు లేకుండా చేస్తారని పిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ హెచ్చరించారు. బిజెపి ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు బిజెపి, టిఆర్ఎస్‌కు మధ్య ఉన్న మైత్రిని మరొకసారి బయటపెట్టాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చేస్తున్న అనైతిక రాజకీయంపై తమ పార్టీకి స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. ఆ పార్టీలకు మించి తమ పార్టీ రాజకీయం చేయగలదని గుర్తు చేశారు. ఇది ప్రజల ప్రభుత్వమనీ, ప్రజలే అన్ని విధాలుగా కాపాడుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైపు కన్నెత్తి చూసినా, హాని చేయాలని తలపించిన ప్రజలే సమాధానం చెప్తారని హెచ్చరించారు. బండి సంజయ్ వ్యాఖ్యలను పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి ఖండించారు.



భూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- ప్రతి గ్రామంలోనూ భూ న్యాయ శిబిరం నిర్వహణ
- యాచారంలో పైలెట్ ప్రాజెక్టు అంకురార్పణలో లీఫ్స్ సంస్థ అధ్యక్షులు భూమి సునీల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా, భూ చట్టాలను రైతులకు చుట్టాలుగా మార్చడమే ధ్యేయంగా యాచారం మండలంలో పైలెట్ ప్రాజెక్టుకు అంకురార్పరణ చేస్తున్నామని లీఫ్స్ సంస్థ అధ్యక్షులు, ధరణి కమిటీ సభ్యులు, భూ చట్టాల నిపుణులు భూమి సునీల్ తెలిపారు. క్షేత్రస్థాయిలోని భూ సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను అన్వేషించాలనే సంకల్పంతో భూ న్యాయ శిబిరాలకు శ్రీకారం చుట్టామన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలో సిసిఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ (సీఎంఆర్ఓ) వి.లచ్చిరెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డితో కలిసి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. భూ సమస్యల వివరాల నమోదుకు సంబంధించిన దరఖాస్తు ఫారాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. వ్యవసాయ భూమి కలిగిన ప్రతివారు ఒక్కసారైనా ఈ భూ హక్కుల పరీక్ష చేయించుకోవాలని పిలుపునిచ్చారు. తమ భూ హక్కులను కాపాడుకోవడంతో పాటు భూ సమస్యల నుంచి బయటపడే మార్గం తెలుస్తుందన్నారు. సమస్యేంటి? చట్టప్రకారం సమస్యకు పరిష్కార మార్గమేంటి? ఎవరిని సంప్రదించాలి? లాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ఈ భూ న్యాయ శిబిరానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా యాచారం మండల పరిధిలోని 21 గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహిస్తామనీ, అందులో గుర్తించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఎవరైనా రైతులు ఫోన్ చేస్తే భూ సమస్యల పరిష్కారానికి ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నామన్నారు. సిసిఎల్ఏ ధరణి ప్రాజెక్టు డైరెక్టర్ (సీఎంఆర్ఓ) వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ధృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఈ క్రమంలోనే రైతులకు సంబంధించిన అంశాలపై వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నదని చెప్పారు. భూ న్యాయ శిబిరం కార్యక్రమం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిలో సమస్యలు, సవరణలపై అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. భూ న్యాయ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షులు జీవన్‌రెడ్డి, న్యాయవాదులు మల్లేశం, ప్రవీణ్, శ్రీకాంత్, సలహాదారు కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన పతంగులు

- గాలిపటం ఎగరేస్తూ భవనంపై నుంచి పడి యువకుడు దుర్మరణం
- మాంజా దారం మెడకు చుట్టుకొని సైనికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. సంక్రాంతి పండుగ వేళ ఎగుర వేస్తున్న పతంగులతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మాంజా దారం మెడకు చుట్టుకొని సైనికుడు మృతి చెందారు. గాలిపటం ఎగరేస్తూ భవనంపై నుంచి పడి యువకుడు దుర్మరణం చెందారు. సైన్యంలో సేవలందిస్తున్న కోటేశ్వరరావు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకొని ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో లంగర్‌హౌస్‌పై వద్ద మెడకు మాంజా చుట్టుకుంది. దీంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలకు గురైన ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కోటేశ్వరరావు విశాఖపట్నంకు చెందినవారు. యువకుడు బిల్డింగ్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన అల్వాల్‌లో చోటు చేసుకుంది. చనిపోయిన యువకుడు పేట్ బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ కుమారుడు ఆకాశ్‌గా గుర్తించారు. ఈ సంఘటనపైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పతంగుల కారణంగా గత రెండురోజుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళ మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. మాంజాదారంపై నిషేధం ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా పలువురు విక్రయిస్తున్నారు. పతంగులను ఎగురవేస్తూ ఇష్టారాజ్యంగా వదిలివేస్తుండడంతో మాంజాదారంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, పక్షులు సైతం బలవుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.

హై టెన్షన్ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీస్తూ ..

హైటెన్షన్ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసే ప్రయత్నంలో విద్యుద్ఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని జోగిపేట పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ ప్రాంతంలో గల ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం (35) సంక్రాంతి పండుగ సందర్భంగా భార్య, పిల్లలతో కలిసి జోగిపేటలో నివాసముంటున్న మామ ప్రసాద్ ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయాన్నే బిల్డింగ్‌పై పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేసి అందరూ ఆనందంగా గడిపారు. పిల్లలు ఎగురవేస్తున్న గాలిపటం బిల్డింగ్‌కు సమీపంలో ఉన్న హై టెన్షన్ వైర్లకు తగిలింది. ఈ క్రమంలో ఆ వైర్ల నుంచి గాలిపటాన్ని తీయడానికి సుబ్రహ్మణ్యం ప్రయత్నించగా.. ఒక్కసారిగా కరెంట్ షాక్ తగిలింది. దాంతో అతడు రెండంతస్తుల భవనం పైనుంచి కిందపడిపోగా.. తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను ముందుగా స్థానిక జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కాగా భర్తను కాపాడబోయే క్రమంలో మృతుని భార్య చాముండేశ్వరికి గాయాలయ్యాయి. వారి కుమారుడికి కూడా గాయాలు అయ్యాయి. మృతుడి స్వస్థలం కృష్ణాజిల్లా గుడివాడ ప్రాంతం.